సాక్షి
విశాఖపట్నం

శనివారం । 21 । డిసెంబర్ । 2024





గత ఏడాది డిసెంబర్ 21న చింతపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విద్యారంగంపై పెట్టే ఖర్చు జాతి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని నమ్మిన దార్శనికుడు.. సామాన్యులకు సైతం కార్పొరేట్ చదువులను అందుబాటులోకి తెచ్చిన విద్యాప్రదాత.. తన పుట్టిన రోజైన డిసెంబరు 21న ప్రతి ఏటా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి అత్యున్నత ప్రమాణాలను అందుబాటులోకి తెచ్చిన క్రాంతిదర్శి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు విద్యారంగానికి స్వర్ణయుగం.. ఆనాడు చదువులకే **అగ్రతాంబూలం.. మరి నేటి కూటమి ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా విదల్చని నిర్లక్ష్యం.. భవిష్యత్తు అగమ్యగోచరం.**



గత ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో విద్యార్థులు

నాడు వెలుగుల జడి
నేడు చతికిలబడి

జగనన్న పాలనలో పేద పిల్లల చదువులకు పెద్దపీట

నాడు నేడు ఇలా..	స్కూళ్లు	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
మొదటి ఫేజ్	165	5,515.67
రెండో ఫేజ్	309	11,479.20

విశాఖ విద్య: 'ప్రపంచాన్ని మార్చి వేయడానికి మీరు ఉపయోగించ గల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య' అని నెల్సన్ మండేలా అన్నారు. పేదరిక నిర్మూలనకు నాణ్యమైన విద్య ఎంత ముఖ్యమో ఈ మాటలు తెలియజేస్తాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిక్కచ్చిగా పాటించిన మంత్రం ఇది. అందువల్లే తన ఐదేళ్ల పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. కూటమి పాలనలో పేద విద్యార్థుల చదువులు సవ్యంగా ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడేసింది. గత ప్రభుత్వంలోనే మంజూరు చేసిన 'జగనన్న విద్యా కానుక'లను 'స్టూడెంట్ కిట్' అని పేరు మార్చి ఏదో విధంగా విద్యార్థులకు పంపిణీ చేసినా, మిగిలిన ఏ ఒక్క పథకం **కూడా** విద్యార్థులకు అందలేదు. తల్లి వందనం **ఊసే** లేదు. జగనన్న గోరుముద్దను డొక్కా **సీతమ్మ** మధ్యాహ్న భోజనం అని, నాడు నేడు **పథ**కాన్ని స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్**మెం**ట్‌గా, జగనన్న విద్యా, వసతి దీవెనల **పథకాలను** పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌గా, జగనన్న **విదేశీ విద్యా** దీవెనను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా **నిధిగా** పేర్లయితే మార్చారు కానీ, విద్యార్థుల**కు మేలు చేసే** చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని స్పష్టంగా **తెలుస్తోంది.** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ**చ్చి ఆరు నెలలు** కావస్తున్నా.. విద్యార్థులకు అందాల్సిన ఏ ఒక్క పథకం కూడా నేటికీ దరిచేరలేదు. మొత్తానికి కూటమి పాలనలో పేద విద్యార్థుల చదువులు తిరోగమనంలో పయనిస్తున్నాయి.

తల్లికి వందనం ఏమైంది?

'తల్లికి వందనం' పేరిట ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు రూ.15వేలు చొప్పున ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అందరికీ ఇచ్చేస్తామని విద్యార్థుల్లో ఆశలు రేకెత్తించినా.. ప్రస్తుతం ఆ పథకం ఊసే లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా జిల్లాలో 1.70 లక్షల నుంచి 2 లక్షల మంది విద్యార్థులు అమ్మ ఒడి ద్వారా ప్రయోజనం పొందారు.

గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి అమలు ఇలా..

సంవత్సరం	విద్యార్థులు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,95,442	290.16
2020-21	2,02,042	303.06
2021-22	1,75,065	262.60
2022-23	1,70,467	255.70

ఇంకా అందని యూనిఫారాలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బడులు తెరిచిన తొలిరోజునే ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులందరికీ తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యాకానుక అందించేవారు. ఏటా సుమారుగా 90 వేల మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక రూపేణా రూ.21.15 కోట్లు ఖర్చు చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికు ఎన్నికల ముందే అన్ని రకాల వనరులు సమకూర్చారు. ఈ లోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి పంపిణీ సవ్యంగా జరగలేదు. విద్యా కానుకను 'స్టూడెంట్ కిట్'గా పేరు మార్చినా.. వాటిని పూర్తి స్థాయిలో అందించే విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. ఇప్పటికీ విద్యార్థులకు యూనీఫారాలు, షూస్ ఇంకా ఇవ్వలేదు.

విదేశీ విద్యకు సాయమేదీ.?

జగనన్న విద్యాదీవెన పథకం కింద విదేశాల్లో చదువుకునే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే చెల్లించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకైతే రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ. కోటి వరకు మంజూరుకు నిర్ణయించి.. పక్కాగా అమలు చేసింది. 2022-23లో 12 మందికి రూ.1,11,82,223, 2023-24లో ఏడుగురు విద్యార్థులకు రూ.1,06,40,787 అందించారు. జగనన్న సివిల్ సర్వీసెస్ పథకం కింద ఐఏఎస్ వంటి అత్యున్నత పరీక్షలకు ప్రిపేర్ అయ్యే ఐదుగురు విద్యార్థులకు రూ.5 లక్షలు ప్రోత్సాహకాలను అందించారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వ పాలనలో వీటి ఊసే లేదు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేదెప్పుడో.?

ఉన్నత విద్యనభ్యసించే పేద విద్యార్థులకు 2019కు ముందు చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి కోర్సుకైనా ఏడాదికి రూ.35వేలు మాత్రమే ఇచ్చేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయటంతో పాటు ఠంఛన్‌గా నిధులు మంజూరు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్‌మెంట్ అమలుకు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా కాలేజీల యాజమాన్యాలు ఫీజు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫీజుల కట్టలేక సతమతమవుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో వసతి దీవెన, విద్యాదీవెన అమలు ఇలా..

సంవత్సరం	విద్యార్థులు (వసతి దీవెన)	మంజూరైన డబ్బులు	విద్యార్థులు (విద్యా దీవెన)	మంజూరైన డబ్బులు
2019-20	41,913	110,48,84,249	39,549	36,87,92,500
2020-21	49,205	97,52,68,301	49,332	46,10,22,500
2021-22	49,090	120,25,51,441	49,427	44,90,82,500
2022-23	45,326	93,41,66,638	45,267	41,11,35,000

బైజూస్ పాఠాలకు బూజు



ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలనే సంకల్పంతో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసింది. 2022-23లో జిల్లాలోని 11,223 మంది విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను అందజేశారు. అలాగే ఎనిమిదో తరగతికి బోధన చేసే 1,116 మంది ఉపాధ్యాయులకు సైతం వీటిని పంపిణీ చేశారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరంలో 10,562 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చే శారు. ప్రస్తుతం వీటన్నింటినీ మూలన పడేశారు. ఇంగ్లిష్ మీడియంకు ప్రాధాన్యమిస్తూ డిజిటల్ విద్యా బోధనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తగిన శ్రద్ధ చూపారు. జిల్లాలోని 132 ఉన్నత పాఠశాలల్లో 1,185 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 146 స్మార్ట్ టీవీలను అమర్చారు. కానీ ప్రస్తుతం పాఠశాలల్లో వీటి వినియోగంపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముద్రను పూర్తిగా చెరిపేయాలనే అక్కసుతో కూటమి ప్రభుత్వ పెద్దలు విద్యార్థులకు తీవ్ర నష్టం చేస్తున్నారు.

అమ్మ ఒడి ధైర్యాన్ని ఇచ్చింది



అమ్మ ఒడి మాలాంటోళ్ల చదువులకు భరోసాగా నిలిచింది. అమ్మ గృహిణి. నాన్న కారుడ్రైవర్‌గా పనిచేస్తూ మమ్మల్ని చదివిస్తున్నారు. చెల్లి ఝాన్సీ 5వ తరగతి, నేను 7వ తరగతి చదువుతున్నాం. నాలుగేళ్ల పాటు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. వీటిని మా అవసరాల కోసం అమ్మానాన్నలు వినియోగించారు. ఇప్పుడా డబ్బులు ఆగిపోయాయి. ఎప్పుడు వస్తాయో కూడా చెప్పడం లేదు.

– సుఖసి హారికా దేవి, సీతమ్మధార

రుచీపచీ లేని మధ్యాహ్న భోజనం



2024-25 విద్యా సంవత్సరంలో నమోదైన గణాంకాల మేరకు 581 పాఠశాలల్లోని 72,892 మంది విద్యార్థులకు బడిలో మధ్యాహ్న భోజనం అందించేలా ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేస్తోంది. వీటిలో 338 స్కూళ్లలోని సుమారు 47 వేల మంది విద్యార్థులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనం సరఫరా చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మెనూ రూపొందించగా.. ప్రస్తుతం ఇదే కొనసాగుతోంది. వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, రోజుకో రకమైన వంటకం, వేరుశనగ చిక్కీ,రాగి జావ రుచిగా, శుచిగా అందించడంతో విద్యార్థులు ఎంతో ఇష్టపడి తినేవారు. కూటమి ప్రభుత్వం మెనూ మార్పు చేస్తామని ప్రకటన చేయడంతో.. ప్రస్తుతం విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపించింది. జిల్లా విద్యాశాఖాధికారులు సరైన పర్యవేక్షణ చేయక పోవడంతో బడి భోజనం అధ్వానంగా తయారైంది. వండిన పదార్థాలు రుచిగా లేక.. చాలా పాఠశాలల్లో విద్యార్థులు ఇళ్ల నుంచే క్యారేజీలు తెచ్చుకుని తింటున్న దుస్థితినెలకొంది.

ఉపయోగకరంగా ట్యాబ్



నేను ఎస్‌ఎంపీ స్కూలులో 9వ తరగతి చదువుతున్నాను. 8వ తరగతిలో ఉన్నప్పుడు ట్యాబ్ ఉచితంగా ఇచ్చారు. మాలాంటోళ్లు సెల్‌ఫోన్ కొనుక్కోవాలంటేనే కష్టం. అలాంటిది చేతికి ట్యాబ్ వచ్చింది. చదువుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం అయితే దాన్ని ఇంటి దగ్గరే ఉంచుతున్నాను. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.

– రెట్టంగి తేజశ్రీ, 9వ తరగతి విద్యార్థి

నేడు మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

విశాఖ సిటీ: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ **కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.**జగన్‌మోహ**న్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భం**గా శని**వారం మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ నేత మొల్లి** అప్పారావు **ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పా**టు చేస్తు**న్నారు. మరో నేత వంకాయల** మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

చదువులపై ప్రభావం చూపకూడదు



ప్రభుత్వం ఏదైనా పిల్లల చదువుల కోసం కార్యక్రమాలు అమలు చేయాల్సిందే. పాలకుల చర్యలు పిల్లల చదువులపై ప్రభావం చూపకూడదు. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే డీఎస్సీ ప్రకటించి, ఉపాధ్యాయ నియామకాలు చేస్తామన్నారు. కానీ దీనిపై కాలయాపన కనిపిస్తోంది. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగిస్తుండటంతో స్కూళ్లలో విద్యా బోధన కుంటుపడుతోంది. అకడమిక్ కార్యకాలపాలను నిర్వీర్యం చేయడం వల్ల విద్యావ్యవస్థకు నష్టం వాటిల్లుతోంది.

– **టీఆర్ అంబేడ్కర్**, జిల్లా కార్యదర్శి, యూటీఎఫ్

సొంత డబ్బులతోనే చదువుకుంటున్నా..



పాడేరు నుంచి వచ్చి ఓ ప్రైవేట్ కాలేజీలో బీఈడీ చదువుతున్నాను. ప్రస్తుతం మూడో సెమిస్టర్ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. గిరిజన తెగకు చెందిన ప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా స్కాలర్‌షిప్ రాలేదు. అక్కలిద్దరూ ఇచ్చిన డబ్బులతోనే చదువుతున్నాను. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కాలేజీకి ఇంటి నుంచి పంపిన రూ.41 వేలు చెల్లించా. ప్రస్తుతం రెండో ఏడాది ఫీజు చెల్లించాలని కాలేజీ వారు అడుగుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు.

– కె.అరుణకుమారి, బీఈడీ విద్యార్థిని

తక్కువ చార్జీలతో పార్సిల్ డోర్ డెలివరీ

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాదరెడ్డి

డాబాగార్డెన్స్: అతి తక్కువ డోర్ డెలివరీ చార్జీలతో వేగంగా పార్సిల్ ఇంటికే చేరవేసేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ద్వారకా బస్టేషన్‌లో ఏపీఎస్‌ఆర్‌టీసీలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 19వరకు మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 2024-25 ఏడాదికి గాను రాష్ట్రం మొత్తం మీద పార్సిల్ ఆదాయం టార్గెట్ రూ.500 కోట్లు కాగా, ఇప్పటి వరకు 70 శాతం అందుకున్నామని తెలిపారు. అనంతరం మంత్రి ద్వారకాబస్టేషనల్లో అన్ని విభాగాలు తనిఖీ చేశారు. ప్రయాణికులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొర, విజయనగరం జోనల్ ఈడీ విజయ్‌కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.రాజశేఖర్, వీఅండ్ ఎస్‌ఓ ఐవీవీపీ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చర్యలు

మహారాణిపేట: జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గాజువాక, ఆటోనగర్ వద్ద గల కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రోడ్ ఓవర్ బ్రిడ్జి పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్‌లో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, సింగిల్ విండో క్లియరెన్స్, పీఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఆర్డీవో శ్రీలేఖ, జిల్లా పరిశ్రమ శాఖ జీఎం వి.ఆదిశేషు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు రూపొందించిన డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విమానయానం... ప్రగతి విహారం



విశాఖ నుంచి ప్రతి నెలా పెరుగుతున్న సర్వీసులు

విశాఖ సిటీ : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నుంచి విమానాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖ నుంచి విమానయానానికి ప్రాధాన్యం పెరుగుతోంది. దేశీయంగానే కాకుండా విదేశీ ప్రయాణికుల సంఖ్య కూడా నానాటికి రెట్టింపు అవుతోంది. ఉత్తరాంధ్ర వాసులే కాకుండా ఒడిశా నుంచి ప్రయాణికులు పెద్ద సంఖ్యలో విశాఖ విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రతి ఏడాది ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ పోతోంది. ఇందుకు తగ్గట్టుగానే ఎయిర్‌పోర్టులో సౌకర్యాలతో పాటు దేశయ, విదేశీ విమాన సర్వీసులు పెరుగుతుండడంతో గత ఏడాది కాలంలో మరింత అద్భుతమైన అభివృద్ధి, పురోగతి సాధించింది.

ప్రతి రోజు 9 వేల మంది రాకపోకలు

కోవిడ్ కారణంగా తగ్గిన విమాన సర్వీసులు, ప్రయాణికుల రాకపోకల్లో వృద్ధి నమోదవుతోంది. 2023 నవంబర్‌లో 2,06,213 మంది దేశీయ ప్రయాణికులు రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది అదే నెలలో ఆ సంఖ్య 16.62 శాతం వృద్ధితో 2,40,494కు చేరుకుంది. అలాగే దేశీయ విమాన సర్వీసులు 2023 కంటే ఇప్పుడు 17.94 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రయాణికుల సంఖ్య కూడా విస్తృతంగా పెరగడంతో అందుకు తగ్గట్టుగానే విమాన సర్వీసులు పెరిగాయి. ఒకవైపు దేశీయంగానే కాకుండా విదేశీ విమాన సర్వీసులు కూడా క్రమేపీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం విశాఖ విమానాశ్రయం నుంచి రోజుకు 9 వేల మంది దేశ, విదేశీ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

పెరిగిన విమాన సర్వీసులు

విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు ప్రాధాన్యత పెరుగుతుండడంతో కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. కోవిడ్‌కు ముందు రోజుకు 23 నుంచి 25 సర్వీసులు ఉండగా ప్రస్తుతం 30 నుంచి 35 సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో ప్రధానంగా ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, కర్నూల్, జైపూర్, పోర్ట్ బ్లెయిర్‌లకు ఇండిగో, ఎయిర్ ఇండియా సర్వీసులు ఉన్నాయి. అలాగే విదేశీ ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతుండడంతో ఇండియా వన్ ఎయిర్, స్కూట్, థాయ్ ఎయిర్ ఏషియా, ఎయిర్ ఏషియా బెర్హాద్ ఎయిర్‌లైన్స్ సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు సర్వీసులు నడుపుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ వరకు విశాఖ నుంచి విజయవాడకు ఒక విమానం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య మూడుకు చేరుకుంది. అలాగే ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి విశాఖకు విమానాన్ని ప్రారంభించేందుకు ఇండియా వన్ ఎయిర్ సిద్ధంగా ఉంది. ఇందుకు ఒడిశా ప్రభుత్వం కూడా ఆమోదించింది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ఇలా అన్ని సర్వీసుల ఆక్యుపెన్సీ కూడా 80 నుంచి 95 శాతం నమోదవుతుండడం విశేషం.

సంవత్సరం	దేశీయ ప్రయాణికులు	ఇంటర్నేషనల్ ప్రయాణికులు
2018-19	27,03,261	1,50,370
2019-20	25,47,992	1,43,580
2020-21	11,06,451	8,192
2021-22	16,28,317	2981
2022-23	24,35,618	65,171
2023-24	27,22,722	66,192
2024-25 (నవంబర్)	18,22,202	81,760

కొత్తగా రెండు అంతర్జాతీయ సర్వీసులు

ఈ ఏడాది కొత్తగా రెండు అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభమయ్యాయి. విశాఖ నుంచి బ్యాంకాక్‌కు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖ నుంచి కౌలాలంపూర్‌కు ఏప్రిల్ 26వ తేదీ నుంచి వారానికి 3 విమానాలు నడుస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విమాన సర్వీసులను ప్రారంభించేందుకు విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. విదేశీ విమాన ప్రయాణికులు రికార్డు స్థాయిలో పెరిగారు. 2023 నవంబర్‌లో 5,165 మంది రాకపోకలు సాగించగా.. ఈ ఏడాది నవంబర్‌లో 83.45 శాతం అధికంగా 9,475 మంది ప్రయాణించారు. అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా గతేడాది 35 ఉండగా తాజాగా 77కు పెరిగి 120 శాతం వృద్ధిని సాధించాయి.

కొండవాలు, లోతట్టు ప్రాంతాలపై అప్రమత్తం

డాబాగార్డెన్స్: అల్పపీడనంతో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. కొండ చరియలు విరిగిపడే పరిస్థితులు ఉన్నందున ఆయా ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులతో పాటు యూసీడీ పీడీ సత్యవేణిని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో భోజనం, తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

జీవీఎంసీ బడ్జెట్‌పై స్థాయీ సభ్యుల చర్చ నేడు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 2025-26 ఏడాది బడ్జెట్‌కి సంబంధించి శుక్రవారం స్థాయీ సంఘ సభ్యులు చర్చించనున్నారు. ప్రీ బడ్జెట్‌కు సంబంధించి ముందుగా స్థాయి సభ్యులు చర్చించి.. సవరించిన బడ్జెట్‌ను త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ఆమోదానికి పంపనున్నారు. ఫిబ్రవరి 15లోపు కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి.

ఆర్టీసీకి ఇంధన పొదుపు అవార్డులు

సాక్షి, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ 2024 రాష్ట్ర ఇంధన పొదుపు మిషన్ అవార్డులను సాధించింది. బస్ స్టేషన్ విభాగంలో విశాఖపట్నం బస్ స్టేషన్ సిల్వర్ కేటగిరీ, బస్ డిపో విభాగంలో సత్తెనపల్లి డిపోకు గోల్డ్ కేటగిరీ అవార్డులు దక్కించుకున్నాయి. అవార్డులు సాధించిన ఆర్టీసీ డిపో, బస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు శుక్రవారం అభినందించారు.

వదలని వర్షం.. స్తంభించిన జనజీవనం



మహారాణిపేట: జిల్లాలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గడిచిన 24 గంటల్లో భీమునిపట్నంలో 42 మి.మీ, కాపులుప్పాడలో 39, గంభీరం, మారికవలస, మధురవాడలో 38, పరదేశీపాలెం, మదీనాబాగ్‌లో 37, ఎండాడలో 36, పెదగంట్యాడలో 35, గాజువాకలో 34, సింహాచలంలో 28, ఆరిలోవలో 27, వీఎంఆర్డీఏ పార్కు ప్రాంతంలో, ఎంవీపీ సర్కిల్‌లో 26 మి.మీ వర్షంపాతం నమోదైంది. నైరుతి బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారుతోంది. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట పొలాలు నీట మునిగాయి. కోసిన వరి పనలు నీటిలోనే ఉన్నాయి. చిరు వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గోపాలపట్నం ఇందిరానగర్‌లో ప్రహరీ కూలిపోయింది.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మల్కాపురం: ఒక వ్యక్తిని హత్య చేసిన నేరానికి ఇద్దరికి గాజువాక 13వ అదనపు జిల్లా జడ్జి కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ తీర్పుకు సంబంధించిన వివరాలివీ.. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న సందీప్ బిశ్వాస్ వద్ద మామిడి తిరుపతిరావు కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. గంట వ్యవధిలో తిరిగి వస్తానని 2011 సెప్టెంబర్‌లో సందీప్ తన భార్యకు చెప్పి ఇంటి నుంచి కారులో బయలుదేరాడు. సమయం గడుస్తున్నా భర్త తిరిగి రాకపోవడంతో అతనికి ఆమె ఫోన్ చేసింది. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో మరికొంత సమయం వేచి చూసింది. ఫలితం లేకపోవడంతో సింధియా వద్ద ఉంటున్న తమ బంధువుల ఇంటికి పిల్లలను తీసుకుని వెళ్లింది. అక్కడకు మామిడి తిరుపతిరావు వెళ్లి.. సార్ ఇంటి వద్ద ఉన్నారు. మిమ్మలను రమ్మంటున్నారని చెప్పి ఆమెను, పిల్లలను కారులో ఇంటికి తీసుకొచ్చాడు. సార్ ఎక్కడని ఆమె అడగ్గా.. పొంతనలేని సమాధానాలు చెప్పాడు. గుచ్చి గుచ్చి ఆమె ప్రశ్నించగా.. 'చెక్ బౌన్స్ కేసులో మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లో సార్ ఉన్నారు. బంగారం, డబ్బు ఇస్తే వ్యక్తిగత పూచీకత్తుతో స్టేషన్ నుంచి తీసుకువస్తాను' అని నమ్మబలికాడు. దీంతో ఆమెకు అనుమానం వచ్చి ఈ విషయాన్ని పక్కింటి వారికి చెప్పేందుకు ప్రయత్నించింది. తిరుపతిరావు ఆమెను బలవంతంగా ఇంటి లోపలికి లాగి బంగారం తీసుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆమె, పిల్లలు కేకలు వేయగా.. చుట్టుపక్కల వారు రావడంతో తిరుపతిరావు పరారయ్యాడు. ఈ ఘటనపై ఆమె అదే రోజు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తిరుపతిరావును అదుపులోకి తీసుకుని విచారించగా.. డబ్బు, బంగారం కోసం దల్లి చిరంజీవితో కలిసి తన యజమానిని హత్య చేసినట్లు అంగీకరించాడు. తిరుపతిరావుతో పాటు అతనికి సహకరించిన చిరంజీవిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జి.షణ్ముఖరావు పైవిధంగా తీర్పు చెప్పారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు అందాయి. కమిషనర్ సంపత్‌కుమార్ ఫోరంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జీవీఎంసీలో నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానివేనని, ఈ నేపథ్యంలో ఇక నుంచి ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో జోన్-2 నుంచి 2, జోన్-3 నుంచి 2, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి 2, జోన్-8 నుంచి ఒక వినతి వచ్చిందన్నారు. అందిన ఫిర్యాదులపై అధికారులు స్పందించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

తీరంలో కోత తీవ్రం





కోతకు గురైన ప్రాంతం పరిశీలిస్తున్న కమిషనర్



భీమిలి తీరంలో కోతకు గురైన తీర ప్రాంతం

- రెండు చోట్ల కూలిన పార్క్ గోడలు

ఏయూక్యాంపస్/భీమునిపట్నం/ఆరిలోవ: విశాఖ సముద్ర తీరంలో కోత తీవ్రమవుతోంది. గడిచిన నెల రోజులుగా వైఎంసీఏ ఎదురుగా తీరం కోతకు గురవుతుండగా.. తాజాగా ఆర్.కె.బీచ్ నుంచి కోస్టల్ బ్యాటరీ దిశగా కొనసాగుతోంది. అల్పపీడన ప్రభావంతో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలకు తీరం కోతకు గురవుతోంది. శుక్రవారం నోవాటెల్ హోటల్ ఎదురుగా ఉన్న చిన్నారుల పార్క్ వెనుక భాగంలో, కోస్టల్ బ్యాటరీకి వెళ్లే మార్గంలో ఉన్న మరో పార్క్‌లో వెనుక భాగంలో గోడలు కూలిపోయాయి. పార్క్‌లోని కొన్ని ఆట వస్తువులు కిందకు జారిపోయాయి. సమాచారం అందుకున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ నోవాటెల్ ఎదురుగా చిన్నారుల పార్క్ ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరితగతిన రక్షణ చర్యలు చేపట్టాలని, సముద్రంలో అలలు ఉధృతంగా ఉన్నందున ప్రజలు బీచ్‌లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడును ఆదేశించారు. అలాగే వైఎస్సార్ సీ వ్యూ(సీతకొండ) పాయింట్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు ప్రాంతాల్లో శుక్రవారం సముద్రం కొన్ని మీటర్ల ముందుకొచ్చింది. తెన్నేటి పార్కు దిగువన తీరంలో నిలిచిపోయిన ఎంవీ మా షిప్ దాటి నీరు ముందుకు చేరింది.

భీమిలి తీరంలోనూ...

భీమునిపట్నం నోవాటెల్ రిసార్ట్ ఎదురుగా తీరం గతంలోనే చాలా వరకు కోతకు గురైంది. ఇప్పుడు అలల తాకిడికి మరింత కోతకు గురై రోడ్డు వరకు వచ్చేసింది. అలాగే బోయివీధి దగ్గరలో రోడ్డు కింద గట్టు భారీగా కోతకు గురైంది. గతంలో ఈ ప్రాంతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇలానే కొనసాగితే ఎత్తులో ఉన్న రోడ్డు కూలిపోయే ప్రమాదం ఉంది. సమాచారం అందుకున్న అధికారులు కోతకు గురైన ప్రాంతంలో బండరాళ్లు వేయించారు.



నోవాటెల్ హోటల్ ఎదురుగా కూలిన గోడ

పొదుపుతోనే ఇంధన వనరుల సంరక్షణ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

ఏయూ క్యాంపస్: సహజ ఇంధన వనరులను పొదుపుగా వినియోగించి, భావి తరాల కోసం సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా మహోద్యమంగా విద్యుత్ పొదుపును తీర్చిదిద్దుదాం అనే నినాదంతో శుక్రవారం ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం వద్ద, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడితో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ విద్యుత్‌తో నడిచే పరికరాల వినియోగం, ఆవిష్కరణకు సాంకేతిక సహాయాన్ని తీసుకోవాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ప్రయోజనాలను వివరించారు. సీఎండీ మాట్లాడుతూ భావితరాల అవసరాల దృష్ట్యా ఇంధన వనరుల వృథాను అరికట్టాలన్నారు. ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తి చేసినట్లేనన్నారు. వారోత్సవాల్లో సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందించారు. ఎస్ఈ జి.శ్యాంబాబు, ఈఈలు బి.సింహాచలం నాయుడు, బి.కె.నాయుడు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్ థర్డ్ ఏసీ (బీ7) కోచ్‌లో శుక్రవారం సాంకేతికలోపం తలెత్తింది. విశాఖపట్నంలో సాయంత్రం 6.40 గంటలకు ఈ రైలు బయలుదేరాల్సి ఉంది. అయితే ఏసీ కోచ్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో రైల్వే అధికారులు సమస్యను గుర్తించారు. అనంతరం మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో ఈ రైలు రెండు గంటలు ఆలస్యంగా 8.50 గంటలకు బయలుదేరింది.

నేత్రపర్వంగా నృత్యోత్సవం



ఆకట్టుకున్న నృత్య విన్యాసం

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నృత్యోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రదర్శనలను కళాభారతి ప్రధాన కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, ఎస్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్, అతిథులు అన్షు, ఎ.ఇందిర, పిల్ల రమణమూర్తి, టేకుమళ్ల శ్యామల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్య కళాక్షేత్ర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ విద్యార్థులు భరతనాట్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. మార్గశిర మాసం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి ప్రాశస్త్యాన్ని నృత్యరూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. డాక్టర్ ఎం.బాలమురళీకృష్ణ స్వరపరిచిన థిల్లానా కృతికి లయబద్ధమైన కదలికలు, అందమైన భంగిమలతో చేసిన నాట్య ప్రదర్శన అందరినీ అబ్బురపరిచింది.

హడావుడి పదోన్నతులు

- అర్ధరాత్రి జాబితాలు.. వాట్సాప్ సందేశాలు
- నేడు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్

విశాఖ విద్య: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియ గందరగోళానికి దారితీస్తోంది. రాత్రి వేళ సీనియార్టీ జాబితాలను ప్రకటించి, తెల్లవారి ప్రమోషన్ల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని వాట్సాప్‌లో సమాచారం పంపిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలోని మున్సిపల్ స్కూళ్లలో పనిచేస్తున్న 12 మంది ఉపాధ్యాయులకు ఇటీవల పదోన్నతులు కల్పించారు. 70:30 నిష్పత్తి పాటించకపోవడంపై వ్యతిరేకత వెల్లువెత్తడంతో మళ్లీ ఖాళీల గుర్తింపు చేపట్టారు. తాజాగా స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 34 ఖాళీలను ప్రకటించారు. ఎస్ఏ తెలుగు-13, హిందీ-3, గణితం-3, ఇంగ్లిష్-4 ఫిజిక్స్-1, బయాలజీ-6, సోషల్-4 ఉన్నట్లు లెక్క తేల్చారు. శనివారం ఉదయం 10.30కు డీఈవో కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని డీఈవో ప్రేమ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలకు గడువీయకుండానే కౌన్సెలింగ్‌కు పిలవడమేంటని ఉపాధ్యాయులు ఆక్షేపిస్తున్నారు.

గ్రామీణ బ్యాంక్ సేవలకు 4 రోజులు అంతరాయం

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలకు నాలుగు రోజుల పాటు అంతరాయం కలుగుతుందని ఏపీజీవీబీ విశాఖ రీజినల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న బ్యాంక్ విభజనలో భాగంగా ఈ అంతరాయం ఏర్పడుతున్నట్లు వెల్లడించారు. ఈ నాలుగు రోజులు ఆయా రాష్ట్రాలకు సంబంధించిన కార్యకలాపాలు విభజించడం జరుగుతుందని తెలిపారు. దీంతో ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బ్యాంక్ సేవలు, ఏటీఎం, ఆన్‌లైన్ నగదు లావాదేవీలతో పాటు ఇతర బ్యాంక్ కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి తిరిగి యథావిధిగా బ్యాంక్ సేవలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి అర్జున్ రామ్ రాక

మహారాణిపేట: కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘావల్ శనివారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 5.20 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. సాయంత్రం 6 గంటలకు నోవాటెల్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. ఆదివారం ఉదయం 7.40 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు.

కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా రమణ నియామకం

మహారాణిపేట: కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ బి.వి.రమణ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కొత్తగా అడ్మినిస్ట్రేటర్ పోస్టును సృష్టించి.. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పక్కా నివేదికలతో హాజరుకండి : కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ఈ నెల 23న జరిగే జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశానికి పక్కా నివేదికలతో అధికారులు హాజరుకావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్ణీత గడువు కంటే ముందుగానే నివేదికలను సమర్పించాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వాటి మార్గదర్శకాలు, ప్రయోజనాలపై ఆయా విభాగాల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆ రోజు మధ్యాహ్నం కలెక్టరేట్ మీటింగ్ హాలులో సమావేశం జరగనుందని, సంబంధిత ఏర్పాట్లు చేయాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తిని ఆదేశించారు.

నేడు 'క్వీన్ మేరీస్'లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మహారాణిపేట: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'వినియోగదారు న్యాయ పాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై పాత పోస్టాఫీసు దరి క్వీన్ మేరీస్ హైస్కూల్లో శనివారం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు జేసీ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు. విజేతలకు 24న జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తారు.

సమీకృత క్రీడా ప్రాంగణం పరిశీలన

విశాఖ స్పోర్ట్స్: విశాఖలోని సమీకృత క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎస్.గిరీశ శుక్రవారం పరిశీలించారు. రుషికొండలోని వాటర్ స్పోర్ట్స్ సెంటర్‌ను పర్యవేక్షించిన ఆయన అవసరమైన తక్షణ మౌలిక సదుపాయాల పనులు చేపట్టాలని ఆదేశించారు. డీఎస్‌డీవో జూన్ గాలియట్, వీఎంఆర్‌డీఏ ఈఈ పాల్గొన్నారు.

ఆర్.కె.బీచ్‌లో ఇద్దరిని కాపాడిన లైఫ్‌గార్డులు

ఏయూక్యాంపస్: ఆర్.కె.బీచ్‌లో ప్రమాదం తప్పింది. స్నానానికి దిగిన ఇద్దరు పర్యాటకులు మునిగిపోతుండగా జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన వీరేంద్ర, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఉపేంద్ర వర్మ అలల ఉధృతికి(రిప్ కరెంట్) కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ వెంకటేష్, రవి వర్మ గమనించారు. వెంటనే స్పందించి ఇద్దరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తెలిపారు. పర్యాటకులను ప్రాణాపాయం నుంచి రక్షించిన లైఫ్‌గార్డ్స్‌ను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ అభినందించారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: విజయవాడ-కాజీపేట సెక్షన్ పరిధిలో ఆధునిక పనుల నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. కింది రైళ్లు ఆయా తేదీల్లో వయా గుంటూరు-పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

- ఈనెల 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు విశాఖపట్నం-లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు సీఎస్‌టీ ముంబయి-భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు భువనేశ్వర్-సీఎస్‌టీ ముంబయి(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు షాలిమర్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్-షాలిమర్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 1, 8వ తేదీల్లో షాలిమర్-సికింద్రాబాద్ (22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7న సికింద్రాబాద్-షాలిమర్ (12774) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జనవరి 8, 9వ తేదీల్లో విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి.

కిమ్స్‌లో 20 శాతం మందికి ఉచిత వైద్యం అందించాలి

- ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: ఎన్ఆర్ఐ ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలు చేపట్టిన కిమ్స్ యాజమాన్యం ఆస్పత్రిలో 20 శాతం మంది రోగులకు ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు లేఖ రాశారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో విలువైన ఓపెన్ ఏరియా/పార్క్ స్థలాన్ని గజం రూ.200 చొప్పున ఎన్ఆర్ఐ ఆస్పత్రికి, రాజీవన్ ఆస్పత్రికి 1988లో కేటాయించారని పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల్లో 10 నుంచి 20 శాతం మందికి ఉచిత వైద్యం అందించాలన్న ఒప్పందంతో భూములు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్ఆర్ఐ ఆస్పత్రిని కిమ్స్ ఆస్పత్రి మేనేజ్‌మెంట్ మూడు నెలల క్రితం దక్కించుకుందని తెలిపారు. 300 పడకలతో ఉన్న ఆ ఆస్పత్రిలో ఉచిత వైద్యానికి 20 శాతం చొప్పున 60 బెడ్లు, రూమ్స్ లేదా 15 శాతం చొప్పున 45 బెడ్స్ కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మార్కెట్ విలువ గజం రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉందన్నారు. అప్పట్లో కేవలం రూ.200కే ఇవ్వడంతో ఇప్పుడా స్థలం విలువ 750 నుంచి వెయ్యి రెట్లు పెరిగిందని వెల్లడించారు. ఎన్ఆర్ఐ నుంచి నిర్వహణ బాధ్యతలు తీసుకున్న కిమ్స్ ఈ మూడు నెలల్లో ఎంత మంది రోగులకు ఉచిత వైద్యం అందించిందన్న వివరాలు సేకరించాలని ఆ లేఖలో కోరారు. అలాగే ప్రతి 15 రోజులకు ఒకసారి ఉచిత వైద్యం అందించిన జాబితాను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్టీపీసీకి ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ఏజీఎం నవీన్‌కిశోర్, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీకి 2024కు గానూ ప్రతిష్టాత్మక ఎనర్జీ కన్జర్వేషన్ రజత పురస్కారం లభించింది. థర్మల్ పవర్ ప్రాజెక్టులో శక్తి సంరక్షణ, శక్తి సామర్థ్యం కేటగిరీలో ఈ అవార్డును ఏపీ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ అందించింది. సంస్థ తరఫున ఏజీ ఎం(ఈఈఎంజీ) నవీన్ కిశోర్, ప్రభుత్వ ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌లు శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారం స్థిరత్వం పట్ల సంస్థకు ఉన్న తిరుగులేని నిబద్ధతను చాటిచెబుతుందన్నారు.

తెలుగు వెలుగు చిన్నయ్య సూరి

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



పేరి రవికుమార్‌కు చిన్నయ్య సూరి పురస్కారం అందజేస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

సీతంపేట: తెలుగుతనానికి నిలువెత్తు నిదర్శనం పరవస్తు చిన్నయ్య సూరి అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా పరవస్తు చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పేరి రవికుమార్‌కు 'చిన్నయ్య సూరి' పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తమిళ భాషకు కచ్చితమైన డాక్యుమెంటేషన్ ప్రదర్శించడం వల్ల ప్రాచీన హోదా లభించిందని, ఆ విధంగా సమగ్రమైన విధానంతో మనం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తామని, త్వరలో తేదీలను ప్రకటిస్తామన్నారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో కొన్ని గ్రంథాలు, పాఠాలు చెప్పే అధ్యాపకులు లేక ఆయా శాఖలను మూసివేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. పురస్కార గ్రహీత పేరి రవికుమార్, పద్య పీఠం వ్యవస్థాపకుడు ఫణిశయన సూరి, ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ అధినేత ఆర్.వెంకటేశ్వర రావు, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ కుమార్, విశ్రాంత ఆచార్యులు కందాల కనకమహాలక్ష్మి, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జీఎం తిరుపతి రాజమన్నార్, ఏయూ తెలుగు విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

'కారుణ్య నియామకాలపై అనుమానాలున్నాయి'

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో కారుణ్య నియామకాలపై పలు అనుమానాలున్నాయని, ఇక నుంచి దీనికి సంబంధించిన ఏ ఫైల్ ఉన్నా.. తమ దృష్టికి తీసుకురావాలని స్థాయీ సంఘం సభ్యులు మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి ద్వారా అధికారులకు సూచించారు. ఆమె అధ్యక్షతన శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశం జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కారుణ్య నియామకాల ద్వారా జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించిన అంశం సభ్యుల చర్చకు వచ్చింది. గత నెలలో 35 మందికి సంబంధించి ఫైల్ చేశామని, 30 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రొసీడింగ్స్ పొందిన 30 మందికి అటెండర్ ఉద్యోగాలు ఇచ్చామని తెలపగా సభ్యులు స్పందించారు. వీరిలో చాలా మంది డిగ్రీ అర్హత ఉన్నప్పటికీ.. ఇద్దరి(మచ్చ గోవింద, అరకు ఉదయ్‌కిరణ్)కే జూనియర్ అసిస్టెంట్లుగా ఎందుకు నియమించారని ప్రశ్నించారు. కారుణ్య నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, అసలు ఉద్యోగుల వారసులేనా? లేదా అని సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని వాయిదా వేశారు. రెవెన్యూ అంశాలను స్థాయీ సంఘం దృష్టికి ఎందుకు తీసుకురావడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో 71 అంశాలు, 2 టేబుల్ అజెండాలు పొందుపరచగా.. 4 అంశాలను వాయిదా వేశారు. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏవో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.